ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 17 మే 2024 | 5



ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	32	28





అమలాపురం రూరల్ చిందాడగరువులో కళ్లాల్లోనే రాశులుగా పోసిన ధాన్యం కిందకు చేరిన నీరు

ముంచేసింది

- బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం
- అకాల వర్షంతో అన్నదాతలకు అగచాట్లు
- కళ్లాల్లోనే తడిసిన ధాన్యం
- బరకాలు కప్పి రక్షించుకున్న రైతులు
- కొనుగోలు చేయాల్సిన ధాన్యం 3.27 లక్షల మెట్రిక్ టన్నులు

అమలాపురం టౌన్/ముమ్మిడివరం, మే 16: అకాల వర్షం రైతులను ముంచేసింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లాలో ప్రారంభమైన వర్షం ఉదయం 10 గంటల వరకు కురిసింది. అనుకోని వర్షంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో పలువురు రైతులు లబోదిబోమంటున్నారు. చేతికంది వచ్చిన పంట ఎక్కడ వర్షం పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తేమ శాతాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో వందలాది మంది రైతులు మాసూళ్లు పూర్తి చేసుకుని రోడ్లపైన, కళ్లాల్లోను ఆరబోస్తున్నారు. వినియోగంలోకి రాని జాతీయ రహదారి బైపాస్‌లో ఎక్కడపడితే అక్కడ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని రాశులుగా పోసుకుంటున్నారు. అకాల వర్షం నీరు ధాన్యపు రాశుల కిందకు చేరిపోవడంతో పంట దక్కుతుందో లేదోనన్న ఆందోళన నెలకొంది. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షంతో వ్యవసాయ పనులకు విఘాతం ఏర్పడింది. 96 శాతం వరి మాసూళ్లు పూర్తికాగా 20వేల మెట్రిక్ టన్నులు (5,700 ఎకరాలు) ధాన్యం కళ్లాల్లో ఉంది. ఈ నెల 7న కురిసిన వర్షాలకు రైతులు కొంత ఇబ్బందిపడినా మళ్లీ వాతావరణం తెరిపివ్వడంతో కోతలను ముమ్మరం చేశారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని ఎండబెట్టుకోవడానికి వీలు లేకుండా పోయింది. కళ్లాల్లోను, వరి పొలాల్లోను ఉన్న ధాన్యం బస్తాలపై రైతులు టార్పాలిన్లు కప్పి వాటిని సంరక్షించే ప్రయత్నాలు చేపట్టారు. ఈ ఏడాది రబీ వరి నాట్లు జనవరి నెల వరకు సాగడంతో కోతలు ఆలస్యమయ్యాయి. సాధారణంగా రబీ వరి మాసూళ్లు మార్చి నెలాఖరు, ఏప్రిల్ 15లోపు పూర్తవుతాయి. అయితే ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి.

ఉప్పలగుప్తం మండలంలో అత్యధిక వర్షపాతం

ఉప్పలగుప్తం మండలంలో అత్యధికంగా 45.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రాయవరంలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో) ఇలా ఉన్నాయి.... కాట్రేనికోన 24.2, అమలాపురం 22.8, అల్లవరం 30.6, సఖినేటిపల్లి 3.2, మలికిపురం 14.2, రాజోలు 7.4, మామిడికుదురు 28.8, అంబాజీపేట 12.8, పి.గన్నవరం 5.8, అయినవిల్లి 20.6, ముమ్మిడివరం 10.4, ఐ.పోలవరం 12.6, కె.గంగవరం 13.2, కపిలేశ్వరపురం 3.2, కొత్తపేట 2.0, రావులపాలెం 3.2, ఆలమూరు 4.2, రామచంద్రపురం 9, రాయవరం 1.4, మండపేట 1.6, ఆత్రేయపురం 5.4.



శివకోటిలో నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ 216పై ప్రయాణిస్తున్న వాహనాలు

ధాన్యం ఆరబెట్టేందుకు నూతన హైవేను ఆరు రోజులు మూసివేయాలి

రాజోలు, మే 16: మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామం నుంచి రాజోలు మండలం శివకోటి వరకు నేషనల్ హైవే 216లో నూతనంగా నిర్మించనున్న ఆరు కిలోమీటర్ల సీసీ రోడ్డును రైతుల సంక్షేమం కోసం ఆరు రోజుల పాటు అధికారులు మూసివేయాలని శివకోటి గ్రామ రైతులు కోరుతున్నారు. ఆరుమిల్లి భానుసుధాకర్, కొమ్మిరెడ్డి సతీష్, కట్టా సత్యనారాయణ గురువారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. నూతనంగా నిర్మించనున్న హైవేపై రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. అయితే ఈ రోడ్డు పూర్తి కాకపోవడంతో ఎన్‌హెచ్ అధికారులు ఇంకా ప్రారంభించలేదు. మోటారు సైకిళ్లు ఆటోలు, టాటా మ్యాజిక్‌లు ప్రయాణించడం వల్ల రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన చెందారు. దేశానికి వెన్నుముక వంటి రైతును కాపాడాలని కోరారు. నేషనల్ హైవే అధికారులు స్పందించి ఈ మార్గంలో వెళ్తున్న వాహనాలను తక్షణం నిలుపుదల చేయాలని కోరారు.

అరటి రైతుల కంట కన్నీరు

ఆత్రేయపురం, మే 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో అరటి పండించిన రైతులకు కన్నీటిని మిగిల్చింది. సుడిగాలి తిరగడంతో ఒక్కసారిగా మొక్కతోట, కర్రతోట విరిగిపోయింది. ఈనిక దశలో ఉన్న అరటి కాస్తా విరిగిపోవడంతో రైతుకు అపార నష్టం కలిగించింది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆత్రేయపురం మండలంలో 3,500, రావులపాలెం మండలంలో 2,000, కొత్తపేట మండలంలో 2,300, ఆలమూరులో 900 ఎకరాల్లో రైతు అరటి పంట సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సుమారు రూ.2లక్షలు పైబడి పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వస్తుంది అనుకుంటున్న తరుణంలో వాయుగుండం ప్రభావం కారణంగా అరటి పంట ధ్వంసమైంది. నియోజకవర్గంలో సుమారు 1,700 ఎకరాల్లో అరటి పంట ఎందుకూ పని రాకుండా నేలమట్టమైంది. ఉద్యానవన శాఖాధికారులు పంట నష్టాలపై అంచనా వేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఎకరానికి రూ.10వేలు అందించనున్నారు.

ఎన్నికల వేళ... పంట నష్టపరిహారం అందని వైనం

ఆలమూరు, మే 16: ఈ నెలలో రెండు దఫాలుగా భారీ వర్షాలు, ఈదురుగాలులకు అరటి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఇటీవలి కాలంలో పంటలు నష్టపోయిన ప్రతిసారీ బీమా రూపంలో ఎంతోకొంత పరిహారం అందుతోంది. అయితే మే నెలలో వచ్చిన ఈదురుగాలులకు ముఖ్యంగా వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఎన్నికల హడావుడిలో ప్రభుత్వం పట్టించుకోకపోవడం అరటి రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లావ్యాప్తంగా వేసవిలో అరటి సాగు విరివిగా జరుగుతుంది. ప్రస్తుతం అరటి పంట గెలలు స్థాయిలో ఉండటంతో ఈదురుగాలులకు భారీ నష్టం చేకూరింది. జిల్లాలో 12-14 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో సాగవుతున్న పంటలో దాదాపు 1,800 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు ఉద్యానవన శాఖ ప్రాథమిక అంచనాలో గుర్తించారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో పరిహారం వచ్చే పరిస్థితి కనిపించట్లేదు. ఎన్నికల సమయం కాకపోతే నష్టాలను గుర్తించి పరిహారం ఇచ్చేవారని రైతులు చెప్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి పరిహారం అందించాలని రైతు ప్రతినిధులు కోరుతున్నారు.



ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో నేలకొరిగిన అరటి పంట



ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెంలో ధాన్యం రాశులను టార్పాలిన్లతో కప్పిన దృశ్యం



అమలాపురం రూరల్ తాండవపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులు



ముమ్మిడివరంలో ధాన్యం రాశి చుట్టూ చేరిన నీటిని తోడుకుంటున్న రైతు



రావులపాలెం మండలంలో ధాన్యం ఆరబెడుతున్న దృశ్యం

ఆన్‌లైనా... ఆఫ్‌లైనా..!

ధాన్యం కొనుగోలులో గందరగోళం

రావులపాలెం, మే 16: వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షాలు కురుస్తుండడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం, ధాన్యం బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. రావులపాలెం మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి కోతలు పూర్తికాగా మరికొన్ని గ్రామాల్లో ధాన్యం రాశులు, పట్టుబడి పట్టిన బస్తాలు, కోత దశకు చేరుకున్న పంట పొలాలు ఉన్నాయి. వారం రోజులుగా ఎండ కాస్తున్నప్పటికీ వర్షాలు కురవడంతో ధాన్యపు రాశులు, బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. ధాన్యం కొంత మేర మొలక కూడా వస్తోంది. వాన తగ్గి పొడి వాతావరణం ఏర్పడే సమయంలో ధాన్యం పట్టి మిల్లుకు పంపిస్తే నూక కటింగ్, తేమ శాతం పేరుతో క్వింటాకు రూ.30 నుంచి రూ.80 వరకు ఇష్టానుసారంగా కటింగ్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ధాన్యాన్ని మిల్లుకు తీసుకువెళ్లాలంటే ధాన్యం పట్టుబడి పట్టిన సమయంలో ఆర్బీకేలో ఉన్న అగ్రికల్చర్ సిబ్బందికి చెప్తే జీపీఎస్ ఉన్న వాహనాన్ని ఆన్‌లైన్ చేసి మిల్లు ఎలాట్‌మెంట్ వచ్చేది. ప్రస్తుత పరిస్థితి గందరగోళంగా మారిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు ఒకరోజు ఆన్‌లైన్, ఒకరోజు ఆఫ్‌లైన్ అని అధికారులు చెప్తుండడంతో ధాన్యం కొనుగోలు అంతా గందరగోళం ఏర్పడింది. తడిసిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యానికి మద్దతు ధర ఇప్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవట్లేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంట చేతికి అందివచ్చిన తరుణంలో వర్షాల కారణంగా పూర్తిస్థాయిలో ఒబ్బిడి కాక కొంత మేర రైతులకు నష్టం వాటిల్లింది. పట్టుబడి ధాన్యం తోలిన సమయంలో తేమ శాతం, నూక కటింగ్, లారీ కిరాయి పేరిట మద్దతు ధరలో కోత విధించడంతో అప్పులు చేసిన పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అప్పనపల్లిలో ఇటుకలపై బరకాలు కప్పిన దృశ్యం

ఇటుక బట్టీలకు అపార నష్టం

మామిడికుదురు, మే 16: బుధవారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షానికి ఇటుక బట్టీలకు అపార నష్టం వాటిల్లిందని నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. నగరం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లోని ఇటుక బట్టీలు వర్షపు నీటిలో మునిగి తేలుతున్నాయి. వేల సంఖ్యలో ఇటుకలు కళ్లాల్లో ఉండడంతో తడిసి ముద్దయి భారీగా నష్టం వాటిల్లిందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసలుగా పేర్చిన ఇటుకలపై టార్పాలిన్లు కప్పుకుని వాటిని సరంక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో రాశులుగా ఉన్న ధాన్యంపై రైతులు బరకాలు కప్పి రక్షించుకున్నారు.

5వేల ఎకరాల్లో కోతలు కోయాలి

వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో 1,69,385 ఎకరాల్లో దాళ్వా సేద్యం చేపట్టగా ఇప్పటికే 1.64 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. అయినవిల్లి, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు, అమలాపురం, అల్లవరం మండలాల్లో ఇంకా సుమారు 5వేల ఎకరాల్లో పంట కోయాల్సి వుంది. ఎన్నికల కారణంగా పనుల్లో ఆలస్యమైంది. వచ్చే వారానికి పూర్తవుతాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులకు పెద్దగా నష్టం ఉండదు. కళ్లాల్లోను, పొలాల్లోను ధాన్యం సురక్షితంగానే ఉంది.

3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలి

డీవీఎస్ ఎల్లారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు

దాళ్వా సీజన్లో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం. ఇప్పటివరకు 1,12,678 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 15,274 మంది రైతుల నుంచి సేకరించాము. ఇంకా 3,27,322 మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశాము.

మద్దతు ధర అటుఇటుగా లభిస్తుంది

మట్టా మహాలక్ష్మిప్రభాకరరావు, రైతు నాయకుడు, చిందాడగరువు

దాళ్వా సీజను మాసూళ్లు పూర్తయిన ప్రారంభంలో ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి దళారులు బస్తా ఒక్కింటికి రూ.1,200కు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.1,500 నుంచి రూ.1,525కు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు దళారులకే ధాన్యాన్ని విక్రయించారు. ప్రస్తుతం తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు ధాన్యాన్ని ఆరబోశారు. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టి మిల్లుకు తరలిస్తే నూక శాతం పెరుగుతుందన్న కారణంగా బస్తాకు వందకు పైగా ధర తగ్గిస్తారు. పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేసినా అదే పరిస్థితి.

ఈఏపీ సెట్‌కు 67 మంది విద్యార్థుల గైర్హాజరు



భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపీ సెట్ పరీక్షకు హాజరైన విద్యార్థుల పత్రాలను పరిశీలించి తనిఖీ చేస్తున్న సిబ్బంది

అమలాపురం రూరల్, మే 16: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నుంచి ఈఏపీ సెట్-2024 ప్రవేశ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫార్మసీ, ఇంజనీరింగ్ అడ్మిషన్ల కోసం రోజుకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు 680 మంది విద్యార్థులకు 67 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 340 మందికి 304 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 340 మందికి 309 మంది హాజరయ్యారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయని, 3వేల మందికి ఈ సెంటరును కేటాయించినట్టు బీవీసీ ఆన్‌లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రమైన అమలాపురానికి సమీపంలో ఉన్న ఈ కళాశాలలో మాత్రమే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హాజరయ్యే విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఇన్‌చార్జిలుగా జిల్లా అధికారులు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అమలాపురం టౌన్, మే 16: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను, ఇతర పోలింగ్ సామగ్రిని కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచగా గురువారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా విధులపై దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతల పర్యవేక్షణపై పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా విధానాన్ని పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించినట్టు ఆయన తెలిపారు. స్ట్రాంగ్ రూములు, పరిసర ప్రాంతాలు సీసీ కెమెరాల నిఘాలో జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసినట్టు వివరించారు. కాట్రేనికోన మండలంలో సమస్యాత్మకమైన పల్లం గ్రామాన్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా, సెక్షన్ 114 అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారధి స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్లు బి.రాజశేఖరరావు, వి.శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యాత్మక గ్రామమైన పల్లం వివరాలను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌కు తెలియజేస్తున్న ఎస్పీ శ్రీధర్



విషం తింటున్నాం..

ఫలం విషతుల్యం..రసాయనాలతో పండిపోతున్న మామిడి.. పండ్లు ప్రమాదకరం అంటున్న వైద్య నిపుణులు

మార్కెట్లో ప్రస్తుతం లభ్యమవుతున్న మామిడిపండ్లు కళకళలాడుతున్నాయి. నిండైన పసుపు పచ్చని రంగులతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అయితే మేడిపండు సామెతలా ఈ పండ్లు పైపైనే చూడముచ్చటగా ఉంటున్నాయి..లోపల మాత్రం ప్రమాదకర రసాయనాలు దాగి ఉన్నాయి..అప్రమత్తంగా ఉండకపోతే రోగాలే..

తుని రూరల్, మే 16: మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే చాలు ఆ పండ్లను ప్రజలు ఎగబడి కొనుగోలు చేస్తారు. మామిడి పండ్లలో తీపితో పాటు రుచిని ఇచ్చే పండ్లు బంగిన పల్లి, కొత్తపల్లి కొబ్బరి, చెరుకురసాలు.. ఉద్యానవన పంటలో 60 శాతం ఈ జాతికి చెందిన మామిడి తోటలు సాగు అవుతున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో మామిడి పండ్ల కొనుగోలు, దిగుబడి చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ధర ఎంతైనా ఆలోచించకుండా కొనుగోలు చేస్తారు. కొనుగోలుదారుల నుంచి వచ్చే డిమాండ్లు చూసి మామిడి పండ్ల సీజన్‌కు నెల రోజుల ముందునుంచే వ్యాపారులు వాటిని అమ్మడం గమనార్హం. పండు దశకు వచ్చిన కాయను గడ్డిలో పెట్టి పండిస్తారు. అలా గడ్డిలో పెట్టిన కాయలు ఒకటి రెండు రోజుల్లో పండుతాయి. కొన్ని మూడు రోజులకు పండుతాయి. అలా రెండు మూడు రోజులు గడ్డి వేసి పండించని వ్యాపారులు రసాయనాలు వేసి ఒక్కరోజులోనే పండిస్తూ వాటిని ప్రజలకు అమ్మేస్తున్నారు. ఇలా రసాయనాలు వేసిన కాయలు మంచి పసుపు రంగు వచ్చి చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని చూసి కొనుగోలు చేసేందుకు ఎగబడతారు. ఎక్కువగా చైత్రమాసం మధ్య నుంచి మామిడి కాయలు మార్కెట్‌లో వస్తాయి. అవి కూడా గడ్డి వేసి పండించేవి ఉంటాయి.

మార్చి నుంచే మార్కెట్లోకి..

కొన్నేళ్లుగా మామిడిపండ్లు మార్చి నుంచే మార్కెట్‌లోకి వస్తున్నాయి. పూర్తిగా పక్వానికి రాని పండ్లపై రసాయనలు చల్లి పండిస్తూ జిల్లాల్లో వివిధ మార్కెట్లలో పెద్ద మొత్తంలో అమ్మకాలు జరుపుతున్నారు. మామిడికాయలపై రసాయనాలు చల్లి అమ్మకాలు సాగిసున్నా అవి తినే వారు రోగాలు పాలవడంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం వీటిని కట్టడి చేసేందుకు దుకాణాలపై దాడులు చేశారు. రసాయనాలు చల్లి అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గడంతో మామిడి పండ్లకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. మెట్టలో వీటి అమ్మకాలు ఆశాజనకంగా మారి జిల్లాలో ప్రధాన మార్కెట్‌లలో రసాయనాలతో పండించిన పండ్లు పెద్ద మొత్తంలో అమ్మకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో మామిడి పండ్ల ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన పండ్లు కొనుగోలు చేసేందుకు సిద్ధపడిన దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలుపుతున్నారు. రసాయనాలతో పండించిన పండ్లతో ప్రజారోగ్యానికి ముప్పు అని వివిధ రకాల క్యాన్సర్‌లకు రసాయనాలు కారణం అవుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



తుని-విశాఖపట్నం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణం

పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా

తీర్చిదిద్దుతా



నన్ను ఆదరించి అండగా నిలిచిన మీ ప్రేమ మరువలేనిది

కుటుంబ సభ్యుడిగా నన్ను గుండెల్లో పెట్టుకున్నారు..

నియోజకవర్గ ప్రజలకు పవన్‌కల్యాణ్ బహిరంగ లేఖ

పిఠాపురం, మే 16: రానున్న రోజుల్లో అందరిని కలుపుకుంటూ పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు గురువారం బహిరంగలేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తనను ఆదరించి అండగా నిలిచి మీరు చూపించిన ప్రేమ మరువలేనిదని, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను అని ప్రకటించగానే స్వచ్ఛందంగా తరలివచ్చి కుటుంబ సభ్యుడిగా భావించి పనిచేయడం ఆనందం కలిగించిందని చెప్పారు. ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్‌లో పాల్గొని రికార్డు స్థాయిలో 86.63 శాతం ఓటింగ్ నమోదు కావడం ప్రజల ప్రేమను తెలియజేస్తున్నదన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జనసైనికులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. సినిమాలు, ధారావాహికలకు విరామం ప్రకటించి పిఠాపురంలో ప్రతి గడపకు వెళ్లి ప్రచారం చేసిన సినీ, బుల్లి తెర నటీనటుల ప్రేమ తనను కదలించిందని పవన్‌కల్యాణ్ తెలిపారు. తన విజయాన్ని కాంక్షిస్తూ ఎంతో మంది అగ్ర కథానాయకులు నుంచి నవతరం నటుల వరకూ అందరు మద్దతు ప్రకటించడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. దేశ, విదేశాలు నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ మాతృభూమి అభివృద్ధి ఆకాంక్షను వెల్లడించిన ఎన్నారై జన సైనికులకు అభినందనలు తెలియజేశారు.

బీఈడీ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

దివాన్‌చెరువు, మే 16: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల సహాయాచార్యులు ఎం.గోపాలకృష్ణ సహ రచయితగా రాసిన పుస్తకాన్ని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీలో బీఈడీ మొదటి సంవత్సరానికి చెందిన భౌతిక, రసాయన శాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం-1 అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని వీసీ తెలిపారు. పుస్తక రచనకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు గోపాలకృష్ణ కృత జ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి ఘటనలో ఇద్దరికి జైలు శిక్ష

పెద్దాపురం, మే 16: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఆరు సంవత్సరాల కిందట ఓ యువకుడిపై జరిగిన దాడి ఘటనలో ఇద్దరు నిందితులకు స్థానిక ఏజేఎఫ్ఎం జడ్జి బుల్లెమ్మ 10 నెలలు జైలు శిక్షతో పాటు రూ. ఆరు వేలు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే 2018 సంవత్సరంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన దార్ల సాయిపై జగ్గంపేటకు చెందిన వజ్రాంగి సుమన్, ఆనూరు గ్రామానికి చెందిన ఇంటి వీర వెంకట సాయికిరణ్ నగదు విషయంపై గొడవ పడి దాడిచేశారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఏ.కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు పూర్తికావడం, నేరం రుజువు కావడంతో నిందితులు సుమన్, వీరవెంకట సాయికిరణ్‌కు 10 నెలలు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.ఆరు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున డి.నాగరాజు వాదించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలమేరకు డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపల్లి, మే 16: ఎద్దులు దెబ్బలాడుకొని వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌పై పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తమూలపేట సెజ్ పునారావాస కాలనీలో గురువారం సాయంత్రం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని సమీపంలో అద్దరిపేటకు చెందిన ముత్తి దేముడు(19) తన స్నేహితునితో కలిసి గురువారం సాయంత్రం కాకినాడకు బీచ్‌రోడ్డులో బయలు దేరాడు. కొత్తపల్లి మండలం కొత్తమూలపేట వచ్చేసరికి రోడ్డుకు మధ్యలో పోట్లాడుతున్న ఎద్దులు వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాయి. ఈ సంఘటనలో దేముడికి తీవ్ర గాయాలై కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రికి వెళ్లేలోగా దేముడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దేముడు స్నేహితునికి తీవ్ర గాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- రేపటి నుంచి కల్యాణోత్సవాలు
- 19 రాత్రి దివ్యకల్యాణం
- రూ.50 లక్షలతో వేడుకలు
- కొండపై, కొండదిగువన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన రథం
- మద్యం విక్రయాలపై ఆంక్షలు
- కల్యాణం వీక్షించేవారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- రత్నగిరి ఈవో రామచంద్రమోహన్



ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడికి ఏడాదిలో అతి ముఖ్యమైన పర్వదినాలలో ప్రధానమైన సత్యదేవుడి వార్షిక కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఏర్పాట్లు వివరాలు వెల్లడించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయని 19 రాత్రి 9గంటలకు దివ్య కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రూ 50 లక్షలు బడ్జెట్ కేటాయించామని చెప్పారు. ప్రధానంగా 19 రాత్రికి జరిగే దివ్య కల్యాణం రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈఏడాది కొండపైన, కొండదిగువన కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్యాణం వీక్షించేభక్తులకు వార్షిక కల్యాణవేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని, భారీ వాహనాలను కొండపైకి అనుమతించడం లేదని కొండదిగువ నుంచి కొండపైకి 8 ప్రత్యేకబస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. దూరం నుంచి వీక్షించే భక్తుల కోసం 5 చోట్ల ప్రత్యేక ఎల్ఈడీ స్ర్కీన్లు, కల్యాణం అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం,, కల్యాణ అక్షింతల పంపిణీకి తూర్పు వైపు 5 కౌంటర్లు పశ్చిమ రాజగోపురం వైపు 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 వేల ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. రెవెన్యూ. పోలీస్, ఫైర్ ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కల్యాణం ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తుల కోసం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందజేయనున్నట్లు చెప్పారు. 22వ తేదీన రథోత్సవం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని రూ.1.20 కోట్లతో తయారుచేసిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల వారం రోజులు మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సాయంత్రం 4 గంటలకే మెయిన్‌రోడ్డుపై మద్యం దుకాణాలను మూయించివేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది స్వామివారి శ్రీపుష్పయోగం స్వామివారి నూతన కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. వారం రోజులు నిత్యకల్యాణం నిలుపుదల చేసి హోమాలు, రథసేవను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామని తెలిపారు.

రథం ట్రయిల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యదేవుడి సేవల కోసం రూ.1.20 కోట్లతో తయారుచేసిన పెద్ద టేకు రథానికి గురువారం నిర్వహించిన ట్రయిల్‌రన్ విజయవంతమైంది. స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలలో 5వ రోజైన 22వ తేదీన సాయంత్రం ఈ రథంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించనుండడంతో ట్రయిల్ రన్ నిర్వహించారు. కొండదిగువ పంపా సత్రం వద్దనుండి తొలిపావంచా వద్ద వరకు నిర్వహించగా అడ్డుగా ఉన్న విద్యుత్, ఇతర వైర్లను తొలగించి రథం పైభాగంలో మరో 6 అడుగుల ఎత్తు వరకు ప్రత్యేక విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పైకి కట్టారు. కొన్ని లోటు పాట్లు కనిపించాయని వాటిని సవరించనున్నట్లు ఈవో రామచంద్ర మోహన్ తెలిపారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వేకువజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి భక్తులను సర్వదర్శనాలకు అనుమతించారు. గురువారం మూలవరులు నిజరూప దర్శనంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆయుష్య హోమం నిర్వహించారు.

మొదటిరోజు ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్



పరీక్షల నిర్వహణా తీరును పరిశీలిస్తున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మే16: ఏపీఈఏపీ సెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షల నిర్వహణాతీరును వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో కన్వీనర్ కె.వెంకటరెడ్డి, కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లతో కలిసి గురువారం పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి ఉదయం నిర్వహించిన పరీక్షకు 921మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 819మంది హాజరయ్యారని, 102మంది గైర్హాజరు కాగా 88.93 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 915మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 836మంది హాజరయ్యారని, 79మంది పరీక్ష రాయలేదని మొత్తం 91.37శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1836మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1655మంది హాజరయ్యారని 181 మంది గైర్హాజరు కాగా మొత్తం 90.14 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. శుక్రవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయని తెలిపారు.



తాబేళ్లు స్వాధీనం

రంపచోడవరం, మే 16: తాబేళ్ల అక్రమ రవాణా కేసులో ఫోక్సుపేట రేంజ్ అటవీ శాఖాధికారులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో ఫోక్సుపేట అటవీశాఖ తనిఖీ కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కోనసీమ జిల్లా రామచంద్రాపురం నుంచి మినీ వ్యాన్‌లో ఒడిసాకు గన్నీ బ్యాగ్‌లలో తరలిస్తున్న 1589 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. బతికి ఉన్న తాబేళ్లను అటవీ ప్రాంతంలో నీరు ఉన్న ప్రదేశాలలో వదిలిపెట్టనున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.


నేటి నుంచి భావనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవాలు

24 వరకు వివిధ కార్యక్రమాలు

సర్పవరం జంక్షన్, మే 16 : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక దివ్య కల్యాణోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 17న స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలను ఆలయ పండితులు నిర్వహిస్తారన్నారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించిన అనంతరం సింహ వాహనంపై పల్లకీలో స్వామివారిని ఉంచి భక్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న స్వామివారి దివ్య కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహిస్తామన్నారు. 23న స్వామివారిని సూర్యారావుపేట బీచ్‌కు తీసుకెళ్లి చక్రస్నానం చేయిస్తామని తెలిపారు. 24న శ్రీపుష్ప యాగోత్సవంతో స్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి, సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం వేళ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సీలేరు కాంప్లెక్స్‌లో హైడల్ డైరెక్టర్

సుడిగాలి పర్యటన



పనులు పరిశీలించిన అధికారులు

మోతుగూడెం, మే16: ఏపీ జెన్‌కో జల విద్యుత్ కేంద్రం(హైడల్) డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ గురువారం సీలేరు కాంప్లెక్స్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని రూ.530 కోట్ల వ్యయంతో జరుగుతున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని రెండో దశ నిర్మాణ పనులను స్థానిక జెన్‌కో అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా 5,6 యూనిట్లకు నీటిని సరఫరా చేసే పెన్‌స్టాక్ పైప్‌లైన్ ఎరక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలోని 5,6 యూనిట్లను అమర్చేందుకు డిజైన్ చేసిన సివిల్ పనులు కూడా పరిశీలించారు. అలాగే జల విద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్ల పని తీరుపై ఆరా తీశారు. యూనిట్లకు సాంకేతిక లోపాలు తలెత్తకుండా విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రిడ్ అధికారులు ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ చేసిన వెంటనే యూనిట్ వినియోగంలోకి వచ్చేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో అన్ని జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వివరాలపై స్థానిక సీఐ బి.శ్రీనాథ్‌ను ఆరా తీశారు. అలాగే సీలేరు కాంప్లెక్సు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయంలో నీటి నిల్వలు ఎంత ఉన్నాయి, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో ఎన్ని టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫోర్‌బై, డొంకరాయి పవర్ కెనాల్‌లను డొంకరాయి సీలేరు జల విద్యుత్ కేంద్రాలను హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, సూపరింటెండెంట్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ విజయ్‌కుమార్, మోతుగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏఈ పవన్‌విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం

ధవళేశ్వరం, మే 16: రానున్న వరదల సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందామని గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లడ్‌బ్యాంక్స్ పటిష్టమైన నేపథ్యంలో బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల ఔట్‌ఫాల్ స్లూయిజ్ షెట్టర్‌లు రిపేర్లు చేసి పటిష్ట పరచాలన్నారు. వరదలను ఎదుర్కోవడానికి ఫడ్ స్టోర్స్‌లో ఫ్లడ్ మెటీరియల్ సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఎస్ఈకి సూచించారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ వీవీ రామకృష్ణ, సెంట్రల్ డెల్టా ఈఈ శ్రీనివాస్, డ్రైనేజ్ డివిజన్ ఈఈ సుబ్బయ్య, వైఎస్సీ డివిజన్ ఈఈ విజయభాస్కర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.90.45 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, మే 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. 31 రోజులకుగాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.67,40,864, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,04,541 మొత్తం రూ.90,45,405 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 710 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ డీసీ, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం 2,30,472 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, పోలీసులు, దేవస్థాన సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


వేట నిషేధ పరిహారం తక్షణమే అందించాలి

కాకినాడ సిటీ, మే 16: మత్స్యకారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, వేట నిషేధ పరిహారం తక్షణమే అందించాలని సీపీఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు స్థానిక ఏటిమొగరోడ్‌లో మత్స్యకారులను కలిసివారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఒకపక్క ధరలు విపరీతంగా పెరిగిపోతూ కుటుంబ జీవనం కష్టంగాఉందని మత్స్యకారులు వాపోయారు. వేటనిషేధం మొదలైన మొదటివారంలోనే అందించాల్సిన పరిహారం ఇంకా ఇవ్వలేదన్నారు.

- పిచ్చిమొక్కలు.. పాముల పుట్టల మధ్య పార్కు
- కనిపించకుండా పోయిన సెంటర్ లైటింగ్
- కళాకాంతులు కోల్పోయిన పార్కు

కాటన్ పార్కుకు పూర్వవైభవం వచ్చేనా!





అమలాపురం కాటన్ పార్కులో తెలుగుతల్లి విగ్రహం, పార్కులో ధ్వంసమైన డ్రాగన్, చెత్తా చెదారాల నడుమ దర్శనమిస్తున్న మొసలి బొమ్మ, కాటన్‌పార్కులో తోకలేని జీబ్రా

అమలాపురం టౌన్, మే 16: అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంటకాల్వ పక్కనే జిగేల్ జిగేల్ మనిపించే విద్యుత్ వెలుగులు. పంటకాల్వ మధ్యలో ఫౌంటెయిన్లు, సెంట్రల్ లైటింగ్.. ఇవన్నీ సినిమా సెట్టింగులు అనుకుంటే పొరపాటే అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో నాడు నిర్మించిన కాటన్ పార్కులో ఐదేళ్ల పాటు కనిపించిన అద్భుత దృశ్యాలు. మనసుకు ఎంతో ఆహ్లాదం, ఆనందాన్ని అందించిన కాటన్ పార్కు ఇప్పుడు అక్కడ ఉందో లేదో తెలియని పరిస్థితి. రికార్డులకే పరిమితమైన ఆ కాటన్ పార్కు కళాకాంతులను కోల్పోయింది. ప్రధాన పంట కాల్వ. చల్లటి గాలులతో అటూ ఇటూ ఊగే పచ్చని చెట్లు.. చల్లని పిల్లగాలుల నడుమ వాకర్లు (నడక వ్యాయామం) నడుచుకుంటూ ముందుకు వెళ్తుంటే మనసుకు ఎంతో హాయిగా ఉండేది. ఇక ఆరోగ్యానికి ఢోకా ఏముంటుంది. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచేందుకు రెండున్నర దశాబ్దాల క్రితం టీడీపీ పాలకులు బృహత్తర పథకాన్ని రూపొందించారు. అమలాపురం నల్లవంతెన- ఎర్రవంతెన మధ్యన ఎన్టీఆర్ మార్గ్‌లో అత్యద్భుతంగా కాటన్ మహాశయుని పేరున 'కాటన్ పార్కు' నిర్మించారు. అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాల్వలో కనులు మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో పాటు మనసుకు ఆహ్లాదాన్ని పంచే వాటర్ ఫాల్స్ ఏర్పాటుచేశారు. 1999నవంబరు 26న అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు పార్కును ప్రారంభించారు. పార్కులో దారి పొడవునా పలు దేవాలయాలు ఉన్నాయి. కాటన్ మహాశయుని విగ్రహంతో పాటు గౌతమ బుద్ధుడు, పరమేశ్వరుని విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఇటీవల అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా తెలుగు తల్లి విగ్రహాన్ని సైతం అదే కాటన్ పార్కులో ఏర్పాటుచేశారు. కనీసం ఆ విగ్రహాలను పట్టించుకునే నాథుడు కూడా లేడు.

వేసవి సెలవులని పిల్లలను తీసుకు వెళ్లేరు..: చిన్నారులకు వేసవి సెలవులు కదా అని గతంలో ఎంతో ప్రాధాన్యతసంతరించుకున్న అమలాపురం కాటన్ పార్కుకు గానీ పిల్లలను తీసుకు వెళ్లేరు.. అక్కడ విరిగి పోయిన బల్లలు.. పేరుకుపోయిన చెత్త.. పిచ్చిమొక్కలు.. ఆకారాలను కోల్పోయిన బొమ్మలు.. కనిపించకుండా పోయిన వాటర్ ఫాల్స్ ఇలా ఒక్కటేమిటి ఎన్నో దర్శనమి స్తాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు కాటన్ పార్కును నిర్లక్ష్యం చేశారు. దాంతో అక్కడ పార్కు ఉందన్న విషయాన్నే పట్టణ ప్రజలు మరిచిపోయే పరిస్థితి ఏర్ప డింది. కాటన్ పార్కులో పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే జంతు వుల బొమ్మలతో పాటు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆట పరికరాలు తుప్పు పట్టి పాడైపోయాయి.



కాటన్ పార్కులోని శివాలయం, ఇలాగైతే నడిచి వెళ్లేది ఎలా

నిర్లక్ష్యం: కాటన్ పార్కు నిర్వహణ భారంగా మారిందని భావిం చారో ఏమోగానీ పంట కాల్వలో ఏర్పాటుచేసిన సెంటర్ లైటింగ్ కనిపించకుండా పోయింది. నిన్న, మొన్నటి వరకు అక్కడక్కడా మిగిలిన పోల్స్ సైతం కనిపించకుండా పోయాయి. ఎందరినో ఆహ్లాదపరచడమే కాదు.. ఆరోగ్య ప్రదాయనిగా పేరొందిన కాటన్ పార్కు పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అశ్రద్ధతో నేడు పిచ్చిమొక్కలు, పాముల పుట్టలతో నిండిపోయింది.

సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా లైటింగ్..

అప్పటికి డివిజన్ కేంద్రమైన అమలాపురంలో అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు స్థానిక నల్లవంతెన -ఎర్ర వంతెన మధ్యనున్న ఎన్టీఆర్ మార్గ్‌లోనే ఉన్నాయి. ఈరహదారిని ఆనుకుని ప్రధాన పంట కాల్వ చెంతన అప్పటి పాలకులు కాటన్ పార్క్‌ను 'ఓ అద్భుతం'గా నిర్మిం చారు. ప్రధాన పంట కాల్వ మధ్యలో ఏర్పాటుచేసిన సెంటర్ లైటింగ్ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా ఉండేది. అప్పట్లో సుమారు రూ.కోటి నిధులను వెచ్చించి రూపొందించిన కాటన్ పార్క్‌ను, వీధి లైట్ల అందాలను తిలకించేందుకు రెండు కనులు చాలేవి కాదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. చిన్నారులనే కాదు, పెద్దలను సైతం ఆకట్టుకుని మనసును ఆహ్లాదపరిచే పార్క్‌గా పేరొందింది.

దారీతెన్నూ లేదు: కాటన్ పార్కులో నడక ప్రియుల కోసం ప్రత్యేక రాయితో రహదారి సౌకర్యం ఉంది. దాంతో పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు వాకింగ్ చేసేవారు. ఇప్పుడు అక్కడ అడుగుతీసి అడుగు వేయాలంటే భయమే. పలుచోట్ల ఆ రహదారి మొత్తంగా మూసుకుపోయింది. పచ్చనిచెట్ల నుంచి చల్లటి గాలి వీస్తుండగా పంట కాల్వ చెంతన పార్కులో నడక మనసుకు ఆనందాన్ని, శరీరానికి ఆరోగ్యాన్ని ఇచ్చేదని అందరూ అంటారు.

బహుళ ప్రయోజనకారి: కాటన్ పార్కు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయన్నది అధికారులకు, పాలకులకు తెలుసు. అయినా ఎందుకు పట్టించుకోరంటే సమాధానం చెప్పేవారు లేరు. అవసరం లేనిచోట్ల రోడ్లు వేయకుంటే లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తారు. ప్రజల ఆరోగ్యానికి, పిల్లల ఆహ్లాదానికే కాదు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఈ పార్కు ఎంతో ఉపయో గపడుతుంది. జిల్లా కేంద్రంగా మారిన అమలాపురంలోని కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వచ్చిపో తుంటారు. అధికారులు అందుబాటులో లేకపోతే ఆ సామా న్యులు కాటన్ పార్కులోనే సేద తీరాల్సిన పరిస్థితి. ఎన్నో ప్రయోజనాలు ఎందరికో ఉపయోగపడే పార్కును ఎందుకు అభివృద్ధి చేయరనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. అధికారం చేపట్టే పాలకులు దృష్టిసారించి పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కళ తప్పిన కాటన్‌పార్కులో సేద తీరేందుకు రాళ్లతో ఎంతో అందంగా నిర్మించిన బల్ల, తాబేలు బొమ్మ

దేవస్థానం భూముల శిస్తు పెంపుపై నిరసన



దేవస్థానం భూముల శిస్తు పెంచొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అంతర్వేది, మే 16: పంటకు కనీస గిట్టుబాటు ధర లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంతర్వేది రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కౌలు రైతుల శిస్తులు పెంచొద్దని దేవస్థానం సహాయ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనేకమంది రైతులు శిస్తులు చెల్లించారని, మిగిలిన బకాయిలు చెల్లించడానికి పది రోజుల వ్యవధి ఇవ్వాలని డిమాండు చేశారు. దేవస్థానం భూమి శిస్తు పెంపుపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కొన్ని బీడు వారిపోయిన భూములు, చౌడు భూములు వ్యవసాయానికి యోగ్యంగా లేవని, శిస్తులు తగ్గించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి కౌలు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు చెల్లబోయిన కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, రైతు సంఘ నాయకులు చెల్లుబోయిన తాతాజీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు బీఎస్పీ నాయకుల పరామర్శ

పి.గన్నవరం, మే 16: ఊడిమూడి వద్ద జరిగిన రోడ్డుప్రమదంలో నలుగురు మృతిచెందగా బాధిత కుటుంబాలను జిల్లా బహుజన సమాజ్ పార్టీ సభ్యులు గురువారం పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన గంటిపెదపూడి, ఆదిమూలవారిపాలెం గ్రామాల్లో నూకపెయ్యి శివ, ఈరి కట్లయ్య, వాసంశెట్టి సూర్యప్రకాష్, చిలకలపూడి మణిబాబుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజోలు- పొదలాడ రహదారి వెంబడి జన సంచారం ఉన్న చోట వాహనాల వేగ నియంత్రణకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ కాండ్రేగుల నరసింహం, జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ దాకే విద్యాసాగర్, నియోజకవర్గ కార్యదర్శి నేలపూడి లెనిన్, మండలాధ్యక్షుడు నేలపూడి ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు కుసుమ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ విజయం ఖాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ విజయం ఖాయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డారు. సుభాష్‌కు టికెట్ కేటాయించిన నాటి నుంచి ప్రణాళిక రూపొందించుకుని పనిచేశామన్నారు. పట్టణ, పార్టీ మండల అధ్యక్షులు, జనసైనికులు, వీరమహిళలు కష్టపడి సుభాష్ విజయం సాధించేదిశగా పనిచేశాయన్నారు. జనసైనికులు, వీరమహిళల రాజకీయ భవిష్యత్తుకు అండగా ఉంటానని పేర్కొన్నారు. అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ కూడా ఖచ్చితంగా విజయం సాధిస్తారన్నారు.

వల్లూరులో ఘర్షణపై రెండు కేసులు

కపిలేశ్వరపురం, మే 16: ఎన్నికల నేపథ్యంలో వల్లూరులో జరిగిన ఘర్షణపై అంగర పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయని అంగర ఎస్ఐ పరదేశి గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, తోట పృధ్వీరాజ్, నేమాని రాజశేఖర్, చోడే శ్రీకృష్ణ దేవళ్ళ రుద్రయ్యచౌదరి, దేవళ్ళ రామలింగ చౌదరి, ముత్యాల సతీష్, మరికొంతమంది మారణాయుధాలతో తనపై దాడి చేయడంతో పాటు తనను కులం పేరుతో దూషించారని దాసి మీనాకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, తోట పృధ్వీరాజ్, దేవళ్ళ రుద్రయ్యచౌదరి, దేవళ్ళ రామలింగచౌదరి, ముత్యాల సతీష్, మరికొంతమంది నా భర్త లీలాకృష్ణపై మారణాయుధాలతో దాడిచేసి హత్యాప్రయత్నం చేశారంటూ లీలాకృష్ణ భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసారు.

పాడి పశువుల దాహార్తి తీర్చండి

ఆర్ఏకు వినతిత్రం అందజేత


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ ప్రతినిధి


తక్కువ నీటితో ఉన్న చెరువు

యానాం, మే 16: యానాం నియోజకవర్గ పరిధిలోని ఫరంపేట గ్రామంలో తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చెరువుల్లో నీటి ఎద్దడి కారణంగా పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 45మంది రైతులు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పాడి పశువుల కోసం నీటిని నిల్వ చేసే నాలుగు చెరువులను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేశారు. వేసవిలో పశువులకు నీటి ఎద్దడి రాకుండా పైప్‌లైన్ల ద్వారా చెరువులను నింపి పశువులకు దాహార్తి తీర్చేవారు. అయితే రెండేళ్లుగా ఈచెరువులను పట్టించుకోకపోవడంతో వేసవిలో నీటి ఎద్దడి చాలా ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. పాడిపశువుల దాహార్తి తీర్చాలని యానాం ఉన్నతాధికారులకు గ్రామప్రతినిధి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బడుగు బలరాం వినతిపత్రం అందజేశారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన



అంబాజీపేట: మొసలపల్లి వద్ద ధాన్యం బస్తాలను బరకంతో కప్పి ఉంచిన రైతులు, ఉప్పలగుప్తం: వర్షానికి నీటితో ఉన్న భట్టుపాలెం-సమనస ఆర్ అండ్ బీ రహదారి

అంబాజీపేట, మే 16: అకాలవర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి అధికంగా వర్షం కురవగా రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పేందుకు పరుగులు తీశారు. మండలంలో 80శాతం వరికోతలు పూర్తికాగా ధాన్యం ఆయా కల్లాల్లోనే రైతులు భద్రపరుచుకున్నారు. ధాన్యం బస్తాలకు బరకాలు కప్పారు. ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో కొంత ఉపసమనం పొందారు. వర్షాలు ఉద్యాన పంటలకు మేలు జరుగుతుందని పలువురు రైతులు తెలిపారు. వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మండలంలో భారీ వర్షం

ఉప్పలగుప్తం, మే 16: మండలవ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 9గంటల వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అనంతరం మధ్యాహ్నం వరకు వర్షపు జల్లులు కొనసాగాయి. మండలంలో దాళ్వా మాసూళ్లు దాదాపు పూర్తవ్వడంతో అంతగా నష్టం జరగలేదు. రైతులు ధాన్యం రాశులను కళ్లాల్లోనే భద్రం చేసుకున్నారు. భారీ వర్షానికి భట్టుపాలెం-సమనస ఆర్ అండ్‌బీ రహదారిపై నీరు చేరింది. గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

విజయంపై ఎవరి అంచనాలు వారివి

అయినవిల్లి, మే 16: పి.గన్నవరం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరగడంతో అధికార పార్టీపై ఉన్న ప్రజా వ్యతిరేకత కారణమని, ఇది శుభ పరిణామమని ఎన్డీయే కూటమి నాయకులు అంచనాలు వేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు మళ్లీ తమకే పట్టం కట్టేందుకు ఓటు వేశారంటూ వైసీపీ నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఓటర్లు మాత్రం తమ మనోగతం బయటపడకుండా సార్వత్రిక ఎన్నికల రోజున ఓంతో ఓపిగ్గా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. యువత, మహిళలు, వృద్ధులు ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలైన్లలో బారులు తీరి మరీ ఓటేశారు. యువత రాష్ట్ర భవిష్యత్తు కోసం, మార్పు కోసం ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి సైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కూటమికి లాభిస్తుందని ఎన్డీయే భావిస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500, వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు తమకు లాభిస్తాయని ఎన్డీయే నాయకులు విశ్వసిస్తున్నారు. గ్రామాల్లో 84శాతం నుంచి 98శాతం ఓట్లు పోలవ్వడం ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించారని కూటమి భావిస్తోంది. పి.గన్నవరం నియోజకవర్గంలో అయినవిల్లి మండలంలో 84.54శాతం పోలింగ్ జరిగింది. అయినవిల్లి మండలంలో 158వ పోలింగ్ కేంద్రంలో 95.43శాతం పోలింగ్ నమోదైంది.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



కపిలేశ్వరపురం, మే 16: వల్లూరులో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై గురువారం కొత్తపేట డీఎస్పీ రమణ విచారణ చేపట్టారు. గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఆయన తనయుడు పృధ్వీరాజ్, మరికొంతమంది మారణాయుధాలతో దాడికి పాల్పడడంతో పాటు కులం పేరుతో దూషించారని సర్పంచ్ దాసి మీనాకుమారి అంగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎస్పీ రమణ గ్రామంలో విచారణ జరిపి ఆమె నుంచి వివరాలు నమోదు చేశారు. డీఎస్పీ విచారణలో మండపేట సీఐ శ్రీధర్ కుమార్, అంగర ఎస్ఐ పరదేశి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:బాక్
శ్రీలలిత	: ప్రసన్నవదనం
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ప్రతినిధి-2

ఉపాధి కూలీకి పాము కాటు

మలికిపురం, మే 16: దిండి గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న సమయంలో గురువారం రాపాక సత్యనారాయణను పాము కరిచింది. అతడిని వెంటనే రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. ప్రస్తుతం సత్యనారాయణ పరిస్థితి నిలకడగా ఉందని ఆయన తెలిపారు.

సపక్‌తక్రా ఉచిత వేసవి శిక్షణా శిబిరం


ఎస్‌కేబీఆర్‌లో సపక్‌తక్రా శిక్షణను ప్రారంభించిన తాతబాబు, శ్రీధర్‌వర్మ

అమలాపురం రూరల్, మే 16: జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 15 వరకు నిర్వహించే సపక్‌తక్రా వేసవి శిక్షణా శిబిరాన్ని వ్యాపారవేత్తలు జవ్వాది తాతబాబు, ఇందుకూరి శ్రీధర్‌వర్మ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి ఎస్ఏఎస్ఎస్ఐఎస్ కోచ్ యాండ్ర గౌతమ్,జాతీయ స్థాయి క్రీడాకారుడు కేతా సతీష్ ఆధ్వర్యంలో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్వీ కుమారశాస్త్రి తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు కేఎస్వీ ప్రసాద్, జీవీ బాబు, చిరంజీవి, మునగాల మన్యం, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు.



ఐటీఐ చదివితే ఉద్యోగావకాశాలు మెండు


జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జిల్లా అధికారి వసంతలక్ష్మి

అమలాపురం టౌన్, మే 16: ఐటీఐ చదవడం వల్ల నేడు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి, కమిటీ కన్వీనర్ ఇ.వసంతలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈఏడాది ఐటీఐలో నూరు శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు ఎన్నో ట్రేడ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎంవీజీ వర్మ మాట్లాడుతూ జూన్ 10వరకు ఐటీఐకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేయించుకోవాలని కోరారు. అడ్మిషన్ టీవో ఈజే మోహనరావు, జిల్లా స్థాయి అధికారులు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు అభినందనలు


కూటమి అభ్యర్థులకు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు



ముమ్మిడివరం, మే 16: కూటమి అభ్యర్థులు దాట్ల సుబ్బరాజు, వేగుళ్ల జోగేశ్వరరావులను ముమ్మిడివరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి దుశ్శాలువాలతో సత్కరించారు. ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు బుచ్చిబాబు, జోగేశ్వరరావులు గురువారం ముమ్మిడివరం పార్టీ కార్యాలయానికి రాగా వారికి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు. జనసేన పార్టీ నాయకులు ఉప్పాడి సర్పంచ్ రంబాల రమేష్, రంబాల దొరబాబు, టీడీపీ నాయకులు అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, పొద్దోకు నారాయణరావు, తాడి జానకీరామ్, ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, మాదాల పరంకుశం, పాయసం చిన్ని, జొన్నాడ రాజారావు, బొక్కా రుక్మిణి, మెండి కమల, మెండి కృష్ణంబాబు, రామాయణం రాజు, చిక్కాల పనసయ్య, రంబాల చౌదరిబాబు, మాగాపు మల్లేశ్వరరావు, మాగాపు పట్టాభి, మేకల చంటి ఉన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు అభినందన



మామిడికుదురు, మే 16: ఏపీ ఆర్జేసీ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన లిఖితపూడి హరిసత్య రామ్మోహన్‌ను టీడీపీ నాయకులు గురువారం కలిసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం మామిడికుదురు గ్రామానికి గర్వకారణమని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అభివర్ణించారు. విద్యార్థిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాయకులు ఈలి శ్రీనివాస్,ముట్టుగుళ్ల కిశోర్, వాసంశెట్టి శంకరరావు, అప్పారి వెంకటేశ్వరరావు, యింటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ద్రాక్షారామ,మే16: చోడవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. చోడవరం బైపాస్ జంక్షన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనంఢీకొట్టడంతో 50ఏళ్లవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం ఛిద్రమైంది. అతడి ఒంటిపై తువాలు మాత్రమే ఉంది. చోడవరం వీఆర్వో ఫిర్యాదు మేరకు రామచంద్రపురం ఎస్ఐ సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

రాజస్థాన్ స్పెషల్ పోలీసు ఫోర్స్ సిబ్బందికి సన్మానం



అమలాపురం రూరల్, మే 16: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన స్పెషల్ పోలీసు ఫోర్స్ అధికారులు, సిబ్బందిని అమలాపురం తాలూకా సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. సమనస గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్పెషల్ పోలీసు ఫోర్స్ అందించిన సేవలను సీఐ కొనియాడారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు, ఏఎస్ఐ డి.ఏడుకొండలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ద్రాక్షారామ, మే 16: కందుల పాలెం ఉపసర్పంచ్ వెంటపల్లి రామకృష్ణపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీ ఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ కోరారు. ఈనెల14న వెంటపల్లి రామకృష్ణ తోటపేటలో ఇంజనీరింగ్ వర్క్సు షాపులో పెయింటింగ్ వేస్తుండగా యాదల వెంకటరమణ రామకృష్ణపై ఉద్దేశపూర్వకంగా దాడిచేశారన్నారు.